ప్రతి అక్షరం ప్రజాహితం

RNI TITLE CODE: 16425 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి -01 సంచిక - 203 శనివారం 16 మార్చి 2024, ఎడిటర్: సీఎం. శ్రీనివాస్ , పేజీలు - 4 , వెల -03/-

# వైసీపీలో చేరిన కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం

### - కాపుల ఆశయాల దిశగా అడుగులు వేస్తున్నది సీఎం జగన్ మాత్రమే- ముద్రగడ



**ఆంధ్ర ప్రగతి/తాడేపల్లి(మార్చి 15):** కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి జగన్‌ను ముద్రగడ పద్మనాభం మర్యాదపూర్వకంగా కలిశారు.ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో ముద్రగడ పద్మనాభం, ఆయన కుమారుడు గిరి వైయస్ఆర్ సీపీలో చేరారు. ఈ మేరకు సీఎం జగన్ వారికి వైయస్ఆర్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాపు సామాజిక వర్గ అభ్యున్నతికి పాటుపడుతున్న సీఎం జగన్ కృషిని పురస్కరించుకుని కాపు నేత ముద్రగడ పద్మనాభం వైఎస్సార్‌సీపీలో చేరారు.ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ.. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాపు సామాజికవర్గం వైఎస్సార్‌సీపీకి మద్దతిచ్చి కాపుల ఆకాంక్షలు నెరవేరేందుకు దోహదపడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ పి.వి.మిథున్ రెడ్డి, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు (తూర్పుగోదావరి జిల్లా వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు), ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

# వైసిపి పునాదులు మా నాన్న రక్తంతో తడిసినాయి..

### - వైసిపి ఎమ్మెల్యేలు మంత్రులు వెంటనే పార్టీని వీడండి..!!

### - వైయస్ సునీత సంచలన వ్యాఖ్యలు



**ఆంధ్ర ప్రగతి/కడప(మార్చి 15):** వైసీపీ పార్టీ పునాదులు, దివంగత నేత వైఎస్ వివేకానంద రెడ్డి రక్తంతో తడిచి ఉన్నాయని, వైకాపా అధినేత, ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చెల్లెలు, వైఎస్ వివేకా కుమార్తె వైఎస్ సునీతా రెడ్డి ఆరోపించారు.వివేకా ఐదో వర్ధంతి సందర్భంగా శుక్రవారం కడపలో స్మారక సభ నిర్వహించారు. ఇందులో వైఎస్ సునీత పాల్గొని మాట్లాడుతూ, తన తండ్రి రక్తంతో వైకాపా పార్టీ పునాదులు తడిసివున్నాయన్నారు. తన తండ్రిని హత్య చేసిన హంతకులపై తాము న్యాయపోరాటం చేస్తుంటే తమపైనే నింద మోపుతారా అని ఆమె ప్రశ్నించారు. హత్యతో తన కుటుంబానికి సంబంధముంటే ఎందుకు అరెస్టు చేయలేదని నిలదీశారు. వివేకానందరెడ్డి జీవితాంతం వైఎస్ఆర్ కోసమే పనిచేశారని చెప్పారు. ఉమ్మడి కుటుంబానికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చేవారన్నారు. ఫ్యాక్షన్, హింసను తగ్గించాలని నిత్యం ఆలోచించేవారని చెప్పారు. "వివేకానంద రెడ్డి మనకి దూరమై ఐదేళ్లు అయింది. ఆయనకు అంత కీడు ఎలా తలపెట్టారని ఆలోచిస్తున్నప్పుడే జగనన్న సీఎం అయ్యారు. ప్రజలందరికీ న్యాయం చేస్తానని ఆయన ప్రమాణస్వీకారం చేశారు. అది చూసి మనమంతా గర్వపడ్డాం. జగనన్నను ఒక ప్రశ్న అడుగుతున్నా.. అంతఃకరణశుద్ధిగా అంటే అర్థం తెలుసా? వివేకాను చంపిన వారికి, చంపించిన వారికి శిక్ష పడేలా చేయాల్సిన బాధ్యత మీకు ఉంది. ఇప్పటివరకూ హంతకులకు శిక్షపడేలా ఎందుకు చేయలేదు? మీ ప్రమాణాన్ని ఎందుకు నిలబెట్టుకోలేదు.? మేం ఈ నేరం చేశామని చెప్పడం మీకు ఎబ్బెట్టుగా లేదా? ప్రభుత్వంలో ఉండి.. మాపై ఆరోపణలు చేయడమేంటి? హంతకులను పట్టిస్తే రూ.5 లక్షలు ఇస్తామని సీబీఐ ప్రకటించింది. జగనన్నా.. మమ్మల్ని పట్టించి ఆ బహుమతి అందుకోండి.అలాగే, జగన్ సతీమణి వైఎస్ భారతీ రెడ్డికి కూడా సునీత ప్రశ్నలు సంధించారు. పదేపదే మాపై ఆరోపణలు చేయడానికి మీకు సిగ్గుగా లేదా? సాక్షి పత్రికలో మాపై నిందలు వేస్తూ వార్తలు రాస్తున్నారు. సాక్షి చైర్ పర్సన్ భారతికి ఓ విన్నపం.. మీ వద్ద ఆధారాలుంటే సీబీఐకి ఇవ్వండి. ఆధారాలు ఉండీ పోలీసులకు ఇవ్వకపోవడం నేరం. అన్నం పెట్టిన చేతిని నరకడం.. వ్యక్తిత్వం మీద బురద జల్లడం దారుణం. మాపై నిందలు వేసినా.. సీతాదేవిలా నిర్దోషిత్వం నిరూపించుకుంటాం. మీ కోసం నిరంతరం పని చేసిన వివేకాను మర్చిపోయారా? తండ్రిపోయిన బాధలో తల్లడిల్లుతున్న కుమార్తె ఒకవైపు ఉన్నారు.. చంపినవాళ్లు, చంపించినవాళ్లు, వాళ్లను కాపాడుతున్న వాళ్లు మరోవైపు ఉన్నారు. ప్రజలారా.. మీరు ఎటువైపు ఉంటారు? దిగ్భ్రాంతిలో ఉండిపోతారా? మీకు స్పందించే అవకాశం వచ్చింది.. స్పందించండి. వైకాపా పునాదులు వివేకా, కోడికత్తి శ్రీను రక్తంలో ఉన్నాయి. ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మీ భవిష్యత్ కోసం బయటకు రండి. రాకపోతే ఆ పాపం మీకు చుట్టుకుంటుంది' అని సునీత వ్యాఖ్యానించారు."" జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని మా నాన్న రాత్రింబవళ్లు ఎంతో కష్టపడ్డారు. నాన్న చనిపోయిన రోజున అవినాష్ రెడ్డే నాతో స్వయంగా చెప్పారు. రాత్రి 11 వరకు చిన్నాన్న ప్రచారంలో ఉన్నారని. మరి అలాంటి వ్యక్తిని చంపించాల్సిన అవసరం ఏముంది? నిందితులను ఇంట్లోనే పెట్టుకుని మాపై కేసులు వేసారు. మా నాన్నను మేం చంపించామని చెప్తున్నారు. మరి మీరు ఇప్పుడు అధికారంలో ఉన్నారు కదా..! మేమే తప్పు చేసి ఉంటే మమ్మల్ని అరెస్ట్ చేయించి విచారణ చేయించండి. సీబీఐ విచారణ వద్దు అన్నారు. పోనీ కోర్టు ద్వారా విచారణ చేయించండి. మీరు ఎన్ని విధాలుగా విచారణలు చేయించినా మేం కడిగిన ముత్యంలా బయటికి వస్తాం. భారతి వదినను ఒక్కటే కోరుకుంటున్నా.మీ దగ్గర సాక్ష్యాలు ఉంటే దయచేసి పోలీసులకు కోర్టుకు ఇవ్వండి. వైసీపీ పార్టీ పునాదులు రక్తంలో మునిగి ఉన్నాయి. మా నాన్న రక్తంతో పాటు కోడికత్తి శ్రీను గారి రక్తం. ఈ ఐదో వర్ధంతి సందర్భంగా వైసీపీ నేతలను ఒక్కటే కోరుతున్నాను. వైపీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు ఇప్పుడే ఆ పార్టీని వీడండి. లేదంటే మా నాన్నను చంపిన పాపం మీకు కూడా చుట్టుకుంటుంది "" అని తెలిపారు సునీతా రెడ్డి.

# బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలు జరపాలి.. సుప్రీంకోర్టులో కాంగ్రెస్ పిటిషన్..!



**ఆంధ్ర ప్రగతి/న్యూఢిల్లీ(మార్చి 15):** బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు విచారించనుంది.లోక్‌సభ ఎన్నికలను బ్యాలెట్ పేపర్ ద్వారా నిర్వహించేలా భారత ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని పిటిషన్‌లో కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో ప్రచురించిన కారణాల జాబితా ప్రకారం.. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం ఇవాళ ఈ కేసును విచారించనుంది. ఈవీఎంలపై ప్రతిపక్ష పార్టీల ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ మధుర జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు.కాగా, ఇందులో ఈవీఎంల ద్వారా ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమిషన్‌కు హక్కు కల్పించే ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 61ఏను రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ విజ్ఞప్తి చేసింది. బూత్ క్యాప్చరింగ్, బ్యాలెట్ బాక్సులను అడ్డుకోవడం, అక్రమ ఓట్లు, పేపర్ వృధా లాంటి బ్యాలెట్ పేపర్‌పై వాదనలు అన్యాయమైనవి అని తెలిపింది. అయితే ఈవీఎం మెషీన్‌లో 2,000 నుంచి 3,840 ఓట్లు నిల్వ ఉన్నాయని పిటిషన్‌లో చెప్పుకొచ్చింది. అంటే ప్రత్యక్ష ఎన్నికల విధానంలో ఒక్కో నియోజకవర్గానికి 50 ఈవీఎం మిషన్ల డేటాను తారుమారు చేయడం ద్వారా లక్ష నుంచి 1.92 లక్షల ఓట్ల వరకు మోసం జరిగే అవకాశం ఉంది అని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తుంది. ఈవీఎం లేదా బ్యాలెట్ పేపర్‌తో సంబంధం లేకుండా ఎన్నికల ఫలితాలు ఒకే విధంగా ఉండటంతో ఈవీఎంల పనితీరుపై, అలాగే అధికార పార్టీపై అనేక అనుమానాలు రేకెత్తిస్తున్నదని కాంగ్రెస్ పిటిషన్‌లో పేర్కొనింది. ఈ పిటిషన్ ను నేడు సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ చేయనుంది.

# అన్నా అని పిలిపించుకున్న వాడే హంతకులకు రక్షణగా ఉన్నాడు..!

### - ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైయస్ షర్మిల సంచలన వ్యాఖ్యలు




**ఆంధ్ర ప్రగతి/కడప(మార్చి 15):** దివంగత నేత వైఎస్ వివేకానంద రెడ్డి ఐదో స్మారకోత్సవం సందర్భంగా ఏపీ సి సి చీఫ్ వైఎస్ షర్మిళ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తన బాబాయ్ గురించి గుర్తు చేసుకుంటూ పలు అంశాలను ప్రస్తావించారు."" అన్నా అని పిలిపించుకున్న వాడే హంతకులకు రక్షణగా ఉన్నాడు. చెల్లెళ్ళ మీద ఎన్ని అభాండాలు వేసినా తట్టుకున్నాం. సునీత చేస్తున్న న్యాయ పోరాటానికి, ధర్మ పోరాటానికి నేను అండగా ఉంటా. ఈ గడ్డ సాక్షిగా మాట ఇస్తున్న. సునీత వెనుక నేనున్నా. ఇది ఆస్తి కోసం,అంతస్తు కోసం జరిగే పోరాటం కాదు. న్యాయం కోసం జరుగుతున్న పోరాటం. ప్రజలందరూ ఒక నిర్ణయం తీసుకోవాలి. హత్యా రాజకీయాలను ఛీ కొట్టాలి. హంతుకుల పక్షాన నిలబడ్డ వారికి ఒక గుణపాఠం నేర్పాలి.వైఎస్ వివేకా ఒక మంచి మనిషి. వివేకాది అద్భుతమైన వ్యక్తిత్వం. అందరికీ సహాయపడే గుణం. నన్ను ఎత్తుకొని తిరిగిన వ్యక్తి మా చిన్నాన్న. సునీత నేను కలిసే పెరిగాం. చిన్నాన్న ఎప్పుడు చికాకు పడలేదు. కోపం రాదు. సహాయం అని అడిగితే వెంట పెట్టుకొని మరి తీసుకొని వెళ్ళే వాడు. సమస్య పరిష్కారం అయ్యే వరకు అండగా ఉండేవాడు. చిన్నాన్న నన్ను ఆఖరిగా కలిశాడు. దారుణంగా నరికి చంపారు. వివేకా సమాజంలో పెద్ద మనిషి. వైఎస్సార్‌కి ప్రియమైన తమ్ముడు. అలాంటి వ్యక్తి హత్య విషయంలో ఇప్పటికీ న్యాయం జరగలేదు. ఈనాటికీ శిక్ష పడలేదు.అంతటి వ్యక్తికే న్యాయం జరగలేదు అంటే సమాజంలో మిగతా వారి పరిస్థితి ఎంటి ? ఇప్పటి వరకు దోషులను గుర్తించాలి. చిన్నాన్న హార్ట్ ఎటాక్‌తో చనిపోయారు అని చెప్పారు. సాక్షి కూడా ఇదే విధంగా కవరేజ్ ఇచ్చింది. ఇక్కడకు వస్తేగాని అసలు విషయం తెలియలేదు. చిన్నాన్న హత్య అని ఇక్కడకు వచ్చాకే తెలిసింది. సునీత పోరాటానికి నేను బలం అయితే హంతులకు శిక్ష పడాలని చేస్తున్న ధర్మ పోరాటంలో నేను ఒక ఆయుధం అవుతా. నేను ఈ మట్టిమేదే పుట్టా. ఈ గడ్డ సాక్షిగా మాట ఇస్తున్నా. సునీత వెనుక వైఎస్ షర్మిలా రెడ్డి ఉంది. ఇది ఆస్తి కోసం, అంతస్థుల కోసం కాదు..న్యాయం కోసం. న్యాయం జరగాలని కొట్లాడుతున్న బిడ్డ కోసం. చిన్నాన్న ఆత్మ శాంతి చేకూరే వరకు ఈ పోరాటం ఆగదు. ప్రజలు అందరూ ఒక నిర్ణయం తీసుకోవాలి. న్యాయం పక్షాన నిలబడాలని ఒక నిర్ణయం తీసుకోవాలి. హత్యా రాజకీయాలను ఛీ కొట్టాలి. హంతకుల పక్షాన నిలబడుతున్న వారికి ఒక గుణపాఠం కావాలి. నిజం గెలవాలి అని తెలిపారు షర్మిళ

# ఎమ్మెల్సీ కవిత అరెస్టు.. ఢిల్లీకి తీసుకెళ్లనున్న ఈడి అధికారులు..!



**ఆంధ్ర ప్రగతి/హైదరాబాద్ మార్చి15:** బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. నేటి మధ్యాహ్నం నుంచి ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక అధికారులు హైదరాబాద్ లోని బంజారాహిల్స్‌లో ఉన్న కవిత నివాసంలో సోదాలు నిర్వహించారు. అప్పటి నుంచి సోదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆమెకు అరెస్ట్ నోటీసులు అందించిన ఈడీ అధికారులు.. అరెస్ట్ చేయబోతున్నట్టు ప్రకటించారు.లోక్ సభ ఎన్నికలకు ముందు ఈ పరిణామం బీఆర్ఎస్ కు పెద్ద షాక్ గానే చెప్పవచ్చు. ఎన్నికల షెడ్యూల్ వెలువడటానికి ఒక రోజు ముందు ఈ అరెస్ట్ చేసుకోవడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశం అవుతోంది. కల్వకుంట్ల కవితను ఈడీ అధికారులు ఢిల్లీకి తీసుకెళ్లనున్నట్టు తెలుస్తోంది. నేటి సాయంత్రం 8.45 నిమిషాలకు కవితను ఢిల్లీ తీసుకెళ్లేందుకు విమాన టిక్కెట్ బుక్ చేసినట్టు సమాచారం.

# నేడు సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల.!




**ఆంధ్ర ప్రగతి/న్యూఢిల్లీ మార్చి 15:** సార్వత్రిక ఎన్నికలకు శనివారం నగారా మోగనుంది. దీనికి సంబంధించి శనివారం మధ్యాహ్నం 3 గంటలకు కేంద్ర ఎన్నికల సంఘం మీడియా సమావేశం నిర్వహించి షెడ్యూల్‌ను ప్రకటించనుంది.ఈ మేరకు ఈసీ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించనుంది. లోక్‌సభతో పాటుగానే.. ఆంధ్రప్రదేశ్ సహా నాలుగు రాష్ట్రాల అసెంబ్లీలకు కూడా పోలింగ్ తేదీలను ప్రకటించనుంది.ప్రస్తుత లోక్‌సభకు జూన్ 16వ తేదీతో గడువు ముగియనుంది. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీలకు ఈ ఏడాది మేలోగా ఎన్నికలు జరగాల్సి ఉంది. ఇందుకోసం ఇటీవల దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో పర్యటించిన ఈసీ.. స్థానిక రాజకీయ పార్టీలు, క్షేత్రస్థాయిలో అధికారులతో విస్తృత సమావేశాలు నిర్వహించింది. ఆ తర్వాత షెడ్యూల్‌ను సిద్ధం చేసింది.గత లోక్‌సభ ఎన్నికలకు 2019 మార్చి 10న షెడ్యూల్‌ను ప్రకటించారు. ఏప్రిల్ 11 నుంచి మే 19వ తేదీ వరకు ఏడు దశల్లో పోలింగ్ జరిగింది. మే 23న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించారు. ఏప్రిల్–మే నెలల్లోనే ఎన్నికలు నిర్వహించేలా ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. షెడ్యూల్ ప్రకటించగానే ఎన్నికల కోడ్ అమల్లోకి రానుంది.

# చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన బైరెడ్డి శబరి



**ఆంధ్ర ప్రగతి/అమరావతి మార్చి15:** ఏపీలో ఎన్నికల షెడ్యూల్ విడుదలకు కొన్ని గంటల ముందు కీలక పరిణామం చోటు చేసుకుంది. రాయలసీమకు చెందిన టీడీపీ సీనియర్ నేత బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి కుమార్తె బైరెడ్డి శబరీ రెడ్డి ఇవాళ టీడీపీలో చేరారు.హైదరాబాద్ లోని చంద్రబాబు ఇంటికి బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, భూమా అఖిలప్రియ సహా సహా ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన నేతలంతా వచ్చారు. రాయలసీమలోని కీలకమైన నంద్యాల ఎంపీ సీటులో టీడీపీ ఈసారి బలమైన అభ్యర్థి కోసం ఎదురుచూస్తోంది. అదే సమయంలో టీడీపీలో ఉన్న బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి కుమార్తె, బీజేపీ నేత అయిన బైరెడ్డి శబరితో ఆ పార్టీ నేతలు టచ్ లోకి వెళ్లారు. ఆమెను బీజేపీ నుంచి టీడీపీలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు చేశారు. అయితే ఎన్నికల సమయం కావడం, బీజేపీతో కూటమి కట్టడం వంటి కారణాలతో శబరి టీడీపీలో చేరిక ఆలస్యమైంది. ఎట్టకేలకు బైరెడ్డి శబరి ఇవాళ టీడీపీలో చేరిపోయారు. దీంతో నంద్యాల ఎంపీ అభ్యర్థిగా ఆమెను బరిలోకి నిలబెట్టేందుకు టీడీపీ ప్రయత్నిస్తోంది. ఇప్పటివరకూ టీడీపీ ఎంపీ అభ్యర్థుల జాబితా విడుదల కాలేదు. రేపు ఈ లిస్ట్ విడుదల చేసే అవకాశం ఉంది. ఇందులో బైరెడ్డి శబరి పేరును నంద్యాల ఎంపీగా ప్రకటిస్తారని తెలుస్తోంది. అటు వైసీపీ నుంచి కూడా నంద్యాల ఎంపీ అభ్యర్థి ఖరారు కాలేదు. అయితే రేపు ఇడుపుల పాయలో జగన్ కూడా వైసీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల జాబితా విడుదల చేస్తున్నారు.రాయలసీమలో నీటి కోసం ఉద్యమాలు నడిపిన చరిత్ర ఉన్న బైరెడ్డిని, ఆయన కుటుంబాన్ని చేరదీయడం ద్వారా వచ్చే ఎన్నికల్లో వైసీపీకి చెక్ పెట్టేందుకు చంద్రబాబు ప్లాన్ చేస్తున్నారు. ఇందులో భాగంగా బైరెడ్డి కుటుంబాన్ని చేరదీయడంతో పాటు ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు ఇస్తున్నట్లు తెలుస్తోంది.

# ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకే పోలీసుల కవాతు

**- ప్రజలు స్వేచ్ఛగా , నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి: డిఎస్పి రవీంద్రనాథ్ రెడ్డి**



**ఆంధ్ర ప్రగతి/మహానంది(మార్చి 15):** ప్రజలు స్వేచ్ఛగా , నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని నంద్యాల డిఎస్పి రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మహానంది మండలంలోని సీతారామపురం, మసీదుపురం గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ.. నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున, ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా, శాంతిభద్రతలను కాపాడడానికి కేంద్ర సాయుధ బలగాల పోలీసులతో కవాతు నిర్వహించారన్నారు.ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికలలో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా దానికి పోలీసు యంత్రాంగం సహకారం ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు. సీఐ శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో కక్షలు, గొడవలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల పట్ల, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున, ఎటువంటి అల్లర్లు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా, శాంతిభద్రతలను కాపాడడానికి కేంద్ర సాయుధ బలగాల పోలీసులతో కవాతు నిర్వహించారన్నారు. సమస్యలు ఏర్పడిన ప్పుడు వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో మహానంది ఎస్ నాగేంద్ర ప్రసాద్, కేంద్ర బలగాలు పోలీసు సిబ్బందిలు పాల్గొన్నారు.

# ఎన్నికల పోలింగ్ సమయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి

**- జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి**



**ఆంధ్ర ప్రగతి/నంద్యాల(మార్చి 15):** భారత ఎన్నికల సంఘం సూచించిన నిబంధనలను అనుసరించి ఎన్నికల సమయంలో అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో ఎన్నికల సమర్థవంత నిర్వహణపై సెక్టోరల్ అధికారులు బూత్ బూత్ స్థాయి అధికారులు సూపర్వైజర్లు, పోలీస్ సెక్టోరల్ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం నిబంధనల ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్లలో ఎక్కడైనా లోపాలు ఉంటే సరిచేయాలని ఆదేశించారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటులో ఎలాంటి లోపాలు ఉండరాదన్నారు. బూత్ స్థాయి పరిధిలోని ఓటర్లకు ఓటింగ్ విధానంపై ప్రభావితులను చేసేందుకు బూత్ స్థాయి అవగాహన గ్రూపులను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎఫ్ఎస్టి, ఎంసిసి, కంట్రోల్ రూమ్ సిబ్బంది మరియు బిఎల్ఓలు చేపట్టాల్సిన చర్యలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల కమీషన్ సూచనలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలన్నారు. పోలింగ్ రోజు ఓటర్లను గుర్తించడంతోపాటు ఓటర్ స్లిప్ లను ఇంటింటికి పంపిణీ చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై సెక్టోరల్ అధికారులను సమన్వయం చేసుకొని తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్యలు తీసుకోవాలని జెసి సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఆర్ఓ, తహసిల్దార్ చబద్రశేఖర్ రెడ్డి, నంద్యాల ఆర్వో పరిధిలోని మండలాల అధికారులు, ఎఫ్ఎస్టి, ఎంసిసి, బిఎల్ఓలు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 17వ తేదీన గ్రూప్- 1 పరీక్షలు


**- పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి**
**- హాజరుకానున్న 3,675 మంది అభ్యర్థులు**
**- జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి**



**ఆంధ్ర ప్రగతి/నంద్యాల(మార్చి 15):** ప్రభుత్వం ఈనెల 17వ తేదీన అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న గ్రూప్– 1 పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఈనెల 17వ తేదీన నిర్వహించనున్న ఏపీపీఎస్సీ, గ్రూప్– 1 పరీక్షలపై లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్ లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పద్మజ, ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్లు శ్రీనివాసరావు ప్రశాంత్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ ఆదివారం ఏపీపీఎస్సీ, గ్రూప్ – 1 సర్వీసెస్ స్క్రీనింగ్ టెస్ట్ (ఆబ్జెక్టివ్ టైప్) పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షలను 17న ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు మరియు మధ్యాహ్నం 02:00 గంటల నుంచి 04:00 వరకు పరీక్షలు రెండు సెషన్ లలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రూప్ – 1 పరీక్షల కోసం జిల్లాలో 7 వెన్యూ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షలకు 3,675 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. పరీక్షల కోసం 7 మంది లైజన్ ఆఫీసర్ల (సీనియర్ జిల్లా స్థాయి అధికారులు)ను నియమించడం జరిగిందని, 7 మంది చీఫ్ సూపరింటెండెంట్ లను నియమించినట్లు పేర్కొన్నారు. ఎక్కడా చిన్న తప్పు జరగకుండా పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలన్నారు.పరీక్ష కేంద్రాలలో వెలుతురు, సీటింగ్ ఏర్పాటు చేయాలని, తాగునీరు ఉన్నాయా లేదా అనేది చూసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలని, పటిష్ట పోలీస్ బందోబస్తు నిర్వహించాలన్నారు. కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా జరగాలన్నారు. పరీక్ష కేంద్రాల పరిధిలో జిరాక్స్ సెంటర్లను మూసి వేయించాలన్నారు. పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని విధాలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఇన్విజిలేటర్లు రాంగ్ బబ్లింగ్ జరగకుండా ముందుగానే తెలియజేయాలన్నారు. పరీక్షకు ఎలాంటి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ అనుమతి లేదన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి హాల్ టికెట్, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు.ఈ కార్యక్రమంలో లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

## సీఏఏపై స్టే విధించాలంటూ సుప్రీంలో పిటిషన్లు.. మార్చి 19న విచారణ..!

**ఆంధ్ర ప్రగతి/న్యూఢిల్లీ మార్చి 15:** పౌరసత్వ సవరణ చట్టం పై స్టే విధించాలంటూ దాఖలైన పిటిషన్లను విచారించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ఈ పిటిషన్లను కోర్టు మార్చి 19న విచారించనుంది. సిఏఏ కోసం కేంద్ర ప్రభుత్వం నిబంధనలను జారీ చేసిన ఒక రోజు తర్వాత, కేరళకు చెందిన రాజకీయ పార్టీ ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ నిబంధనల అమలుపై స్టే విధించాలని కోరుతూ అత్యున్నత న్యాయస్థానాని ఆశ్రయించింది. ఈ చట్టాన్ని నిషేధించాలని, ముస్లిం వర్గానికి చెందిన వ్యక్తులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోరాదని కేరళకు చెందిన రాజకీయ పార్టీ డిమాండ్ చేసింది. ఐ యు ఎం ఎల్ తో పాటు డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అస్సాం అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు దేబబ్రత సైకాతో పాటు అస్సాం నుంచి కాంగ్రెస్ ఎంపీ అబ్దుల్ ఖలీక్ తో పాటు ఇతరులు కూడా నిబంధనలపై స్టే కోరుతూ పిటిషన్లు దాఖలు చేశారు.ఇక, ఈ చట్టం ఏకపక్షంగా ఉందని తెలిపారు. కేవలం వారి మతపరమైన గుర్తింపు ఆధారంగా ఒక వర్గానికి అనుకూలంగా అన్యాయమైన ప్రయోజనాన్ని కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. ఇది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 లేదా 15 ప్రకారం అనుమతించబడదని పిటిషన్ పేర్కొంది. మతం ప్రాతిపదికన సిఏఏ వివక్ష చూపుతున్నందున.. రాజ్యాంగం యొక్క ప్రాథమిక నిర్మాణం అయిన లౌకికవాదం యొక్క మూలంపై దాడి చేస్తోందని పిల్ లో తెలిపింది. ఇక, సిఏఏ 11 డిసెంబర్ 2019న పార్లమెంట్ ఆమోదించింది.. మరుసటి రోజు రాష్ట్రపతి ఆమోదం పొందింది.. సీఏఏ 10 జనవరి 2020 నుంచి అమలులోకి వచ్చింది. ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్ తో పాటు పాకిస్తాన్‌లలో మతపరమైన హింస నుంచి పారిపోయి డిసెంబర్ 31, 2014 లేదా అంతకు ముందు భారతదేశంలో ఆశ్రయం పొందిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు, క్రైస్తవులకు పౌరసత్వం ఇవ్వాలని ఈ చట్టంలో కేంద్ర ప్రభుత్వం రూపొందించింది.




## వైయస్ అవినాష్ రెడ్డి బెయిల్ రద్దు పిటిషన్.. హైకోర్టు కీలక నిర్ణయం..!

**ఆంధ్ర ప్రగతి/అమరావతి మార్చి15:**మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అనుచరుల నుంచి బెదిరింపులు ఎదుర్కొంటున్న అప్రూవర్ దస్తగిరి ఇవాళ తెలంగాణ హైకోర్టు ను ఆశ్రయించారు.అవినాష్ రెడ్డి బెయిల్ రద్దు కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. విచారణకు స్వీకరించింది.వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడిగా ఉన్న అవినాష్ రెడ్డికి గతంలో తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ బెయిల్ ను సవాల్ చేస్తూ పలు పిటిషన్లు దాఖలైనా రద్దు మాత్రం కాలేదు. అయితే తాజాగా దస్తగిరికి వైఎస్సార్ జిల్లాలో బెదిరింపులు పెరిగాయి. దీంతో దస్తగిరి పదే పదే మీడియా ముందుకు వచ్చి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇవాళ అవినాష్ రెడ్డి బెయిల్ రద్దు కోరుతూ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై త్వరలో విచారణ జరగనుంది.దస్తగిరి దాఖలు చేసిన పిటిషన్ పై స్పందించిన తెలంగాణ హైకోర్టు విచారణకు స్వీకరించడంతో పాటు అవినాష్ రెడ్డి, సునీతారెడ్డికి నోటీసులు జారీ చేసింది. గతంలో సునీతారెడ్డి కూడా సుప్రీంకోర్టు వరకూ వెళ్లి అవినాష్ రెడ్డి బెయిల్ రద్దు కోరారు. దీంతో ఇప్పుడు తెలంగాణ హైకోర్టు ఆమె అభిప్రాయం కోరుతూ నోటీసులు జారీ చేసింది. దీనిపై ఆమె ఇచ్చిన వివరణ ఆధారంగా విచారణ జరిపి తదుపరి నిర్ణయం తీసుకోనుంది. అలాగే సీబీఐ కూడా ఈ పిటిషన్ పై తమ అభిప్రాయం చెప్పబోతోంది.



## మార్కెట్ ప్రసాద్ దంపతులకు ఘనంగా సత్కారం



**ఆంధ్ర ప్రగతి/మహానంది(మార్చి15):** నంద్యాలకు చెందిన కూరగాయల వ్యాపారి మార్కెట్ ప్రసాదంపతులను శ్రీకాళహస్తి క్షేత్రంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శ్రీకాళహస్తి క్షేత్రంలో ముగిన సందర్భంగా సన్మానించారు. శ్రీకాళహస్తి క్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాలతో పాటు వివిధ ఉత్సవాలకు మరియు కార్తీకమాసం ఇతర సందర్భాల్లో అవసరమగు కూరగాయలతో ఆర్థిక సహాయ సహకారాలు గత కొన్ని సంవత్సరాల నుంచి అందిస్తూ ఉండ డంతో దీనికి గుర్తింపుగా దాతలను గౌరవింపులో భాగంగా శ్రీకాళహస్తి క్షేత్రంలోని ధూర్జటి కళాక్షేత్రంలో ఏర్పాటుచేసిన అభినందన సభలో ఘనంగా ఆలయ ఈవో ఎస్ వి నాగేశ్వ రరావు అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ పాలక మండలి సభ్యులు అంజూరి శ్రీనివాసులు దుశ్శాలువతో సత్కరి ంచి మెమొంటో మరియు స్వామివారి తీర్థ ప్రసాదాలను అంద జేశారు. మార్కెట్ ప్రసాద్ మహానంది క్షేత్రంలో జరిగే నిత్య అన్న ప్రసాద వితరణానికి అహోబిలం శ్రీకాళహస్తి క్షేత్రాలకు ముఖ్య పర్వదిన సందర్భాల్లో ఉచితంగా కూరగాయల వితరణ తోపాటు ఆర్థిక సహాయ సహకారాలు అందజేస్తూ ఉండడంతో దాతలకు ఇచ్చే గౌరవ సూచకంగా సన్మానించడం విశేషం.

## ఈవీఎంల పనితీరుపై ఆరోపణలు.. పిటిషన్ కొట్టివేసిన సుప్రీంకోర్టు.!




**ఆంధ్ర ప్రగతి/న్యూఢిల్లీ మార్చి 15:** త్వరలోనే దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. శనివారమే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఎన్నికల సంఘం మీడియా సమావేశం నిర్వహించనుంది.ఈ నేపథ్యంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల పనితీరులో అవకతవకలు ఉన్నాయని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించలేమని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.ఈవీఎంల పనితీరులో అవకతవకలు ఉన్నాయని ఆరోపిస్తూ దాఖలైన ఓ పిటిషన్‌ను శుక్రవారం భారత సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఊహాజనితమైన ఆరోపణలతో దాఖలైన పిటిషన్‌ను విచారించలేమని న్యాయస్థానం పేర్కొంది. ప్రతీ విధానంలోనూ సానుకూల, ప్రతికూల అంశాలుంటాయని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈవీఎంల పనితీరుపై అనుమానాలు వ్యక్తంచేస్తూ దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం పరిశీలించింది.గత కొన్ని ఏళ్లుగా భారతదేశంలో ఈవీఎంలతోనే ఎన్నికలు జరుగుతున్నాయి. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లపై అనుమానాలు ఉన్నాయంటూ ఎప్పటి నుంచి ఆయా పార్టీలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే పలు పిటిషన్లను కోర్టు విచారించింది. తాజా పిటిషన్‌ను కూడా తిరస్కరించింది. దీన్ని విచారించలేమని పేర్కొంది.

## ఎన్నికల ప్రచారంలో అపశృతి.. తొలిరోజే సొమ్మసిల్లి పడిపోయిన టీడీపీ అభ్యర్థి

**ఆంధ్ర ప్రగతి/శ్రీసత్యసాయి జిల్లా మార్చి 15:** టీడీపీ ఎన్నికల ప్రచారంలో అపశృతి చోటుచేసుకుంది. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి స్పృహతప్పి పడిపోయారు. మొదటి రోజు ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తచెరువు మండల కేంద్రానికి సింధూర వచ్చారు. అదే రోజు ప్రచారం మొదలుకావడంతో పల్లె సింధూరకు ఘనస్వాగతం పలికేందుకు టీడీపీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేశారు. భారీ ర్యాలీ నిర్వహించి.. పెద్ద ఎత్తున బాణసంచా పేల్చారు. అలాగే సింధూరకు పూల మాలలు వేసి.. దారి పొడ వునా పూలు జల్లారు.ఒకవైపు ర్యాలీకి భారీగా వచ్చిన జనం.. మరోవైపు బాణసంచా కాల్చిన వాసన, మెడలో పూల దండలు.. దీనికి తోడు ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో సింధూరకు ఊపిరాడలేదు. శ్వాస సక్రమంగా అందకపోవడంతో ర్యాలీలోనే సొమ్మసిల్లి పడిపోయింది. అది గమనించిన భర్త కృష్ణ కిశోర్ రెడ్డి ఇతర మహిళా కార్యకర్తల సహాయంతో ఆమెను వాహ నంలో నుంచి దింపి కారులో ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగానే ఉందని టీడీపీ శ్రేణులు తెలిపాయి.



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# నియోజకవర్గంలోని మహిళలకు 30 వేల చీరెల పంపిణీ


**- ఈ నెల 18 నుంచి నంద్యాల, గోస్పాడు గ్రామాల్లో పంపిణీ - టిడిపి,జన సేన, బిజెపి పొత్తుతో మహిళలు ఆనందంగా వుండాలి**




**ఆంధ్ర ప్రగతి/నంద్యాల(మార్చి 15):** నంద్యాల నియోజక వర్గం లోని నంద్యాల, గోస్పాడు గ్రామంలోని మహిళలు ఆనందంగా వుండాలని చీరెలు పంపిణీ చేస్తున్నట్లు నంద్యాల బిజెపి అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మదు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన ఫోన్ లో మీడియా కు తెలిపారు.అభిరుచి సేవాసమితి అధ్వర్యంలో 30 వేల చీరెల పంపిణీ చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం,జన సేన, బిజెపి పొత్తు కుదరడం తో మహిళలు ఆనందంగా వుండాలని చీరెలు పంలినిచేస్తున్నట్టు తెలిపారు.ఈ నెల 18 న నంద్యాల లో 15 వేలు గోస్పాడు లో 15 వేలు చీరెలు పంపిణీ చేస్తామని అన్నారు.మొదట నంద్యాల బిజెపి పార్లమెంట్ కార్యాలయంలో పంపిణీ చేసిన అనంతరం పట్టణం లోని వార్డుల,నంద్యాల మండలంలోని గ్రామాలు, గోస్పాడు గ్రామాల్లో పంపిణీ చేస్తామని అన్నారు.ఎన్నికలకు సంబంధం లేకుండా 20 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని అన్నారు.భవిష్యత్తులో అందరి చల్లని దీవెనలతో,ప్రజల ఆశీస్సులతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తానని పేర్కొన్నారు.ప్రజా దేవుళ్ళ ఆశీర్వాదం కావాలని కోరారు.రాష్ట్రంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని కోరారు.మహిళల ఆశీర్వాద బలం వుంటే ఏదైనా సాదించవచ్చన్నారు.

# పేద విద్యార్థులకు ఎప్పుడు అండగా ఉంటాం

**- టిడిపి నాయకులు హేమేశ్వర్ రెడ్డి**



**ఆంధ్ర ప్రగతి/నంద్యాల(మార్చి15):** టిడిపి నాయకులు హేమేశ్వర్ రెడ్డి పదవ తరగతి విద్యార్థుల తో మాట్లాడుతూ టీడీపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాతిరెడ్డి తులసి రెడ్డి ఆదేశాలతో ఎవరికైనా ఏ అవసరం వచ్చిన సహాయం సహాయం అన్న లా నేనున్నానని విషయాన్ని మర్చిపోవద్దని పిల్లల భవిష్యత్ చదువులే తీర్చిదిద్దుతాయ పదవ తరగతి పరీక్ష సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో శారదా విద్యపీఠం స్కూల్ లో చదువుతున్న విద్యార్థులకు పరీక్ష రాయడానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని నా దృష్టికి రావడం జరిగింది.. విద్యార్థులకు నాకు తోచినంత సహాయాన్ని పరీక్ష సమయంలో రాయడానికి ఉపయోగపడే "మెటీరియల్ "కిట్టు" ను అందజేయడం జరిగింది అలాగే పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని అలాగే విద్యార్థులు కూడా సేవా కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు పిల్లల భవిష్యత్తు బాగుండాలి అంటే ఒక్క చదివే అని మా తండ్రి జయరాం రెడ్డి ఎప్పుడు అనేవారని విద్యార్థులు చదువు కోసం ఎంతవరకైనా సహాయం చేయడానికి ముందుంటానని పేర్కొన్నారు.అదేవిధంగా శారదా విద్యాపీఠం లో చదువుతున్న విద్యార్థులు పరీక్షలో మంచి ఫలితాలు రావాలని స్కూల్ యాజమాన్యానికి మంచి పేరు తేవాలని అందుకోసం ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నతమైన స్థానాల్లో నిలవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఎప్పుడు ఏ విద్యార్థులకు ఏ అవసరం వచ్చినా విద్యార్థులకు ఓ అన్నల నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా శారదా పీఠం ప్రిన్సిపల్ మాట్లాడుతూ హేమేశ్వర్ రెడ్డి సహాయ సహకారాలు ఎప్పుడూ ఉండాలని పిల్లలకు సహాయం చేయడం అభినందనీయమని మా శారదా విద్యపీఠం స్కూల్ యజమాని తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

# రాజ్యాంగ పునాది పైన దాడి సిఏఏ వ్యతిరేకించండి



**ఆంధ్ర ప్రగతి/నంద్యాల(మార్చి 15):** భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్ )సిపిఎం పార్టీ ఆఫీస్‌లో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తాజాగా అమల్లోకి తీసుకొచ్చిన సిఏఏ దేశ రాజ్యాంగం యొక్క పునాదిపై దాడి అని దానిని దేశ భవిష్యత్తును కోరుకున్న వాళ్ళందరూ వ్యతిరేకించాలని, రాజకీయ పార్టీలు, ముస్లిం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు అధ్యక్షత వహించారు. ఈ యొక్క కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి టి రమేష్ కుమార్, సిపిఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్ వై డి ప్రసాద్,ప్రజాస్వామ్య లౌకిక ఐక్యవేదిక సెక్రటరీ అబులైజ్ ,జమాతే ఇస్లామిక్ హిందూ కన్వీనర్ సమ్మద్, తెలుగు ఉభయ రాష్ట్రాలు క్రిస్టియన్ జేఏసీ కన్వీనర్ మన్యం జానయ్య వెల్ఫేర్ పార్టీ అధ్యక్షులు అన్సర్ భాష, సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కేఎండి గౌస్ ,డీ లక్ష్మణ్ ,పార్టీ సీనియర్ నాయకులు తోట మద్దులు, తదితరులు పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 సంవత్సరంలో కేంద్రంలో బిజెపి పార్టీ సిఏఏ ను అమలు చేయాలని చూస్తే దేశవ్యాప్తంగా అతిపెద్ద ఉద్యమం జరిగాయి. దానితో వెనక్కి తగ్గింది మళ్లీ ఇప్పుడు ఎలక్షన్స్ వస్తున్నాయి. కాబట్టి దీన్ని అడ్డుపెట్టుకుని అధికార లబ్ధి పొందడం కోసం ఇప్పుడు బిజెపి పార్టీ సీఏఏను తెరపైకి తెచ్చింది,భారతదేశంలో ఉండే లౌకికవాదులందరూ దీన్ని వ్యతిరేకించాలని వారు అన్నారు. వామపక్ష రాజకీయ పార్టీలతో అలాగే కాంగ్రెస్ ,ఆమ్ ఆద్మీ ,ప్రజా సంఘాలతో సీఏఏకు వ్యతిరేకంగా మన నంద్యాలలో సెమినార్ జరుగుతుందని ,ఈ యొక్క సెమినారుకు సిఏఏను వ్యతిరేకించే వాళ్ళందరూ హాజరయ్యి జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ రాజ్యాంగానికి లౌకిక ప్రజాస్వామ్యం పునాది,అయితే దురదృష్టవశాత్తు ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లుగా రాజ్యాంగంలోని లౌకిక లక్షణాన్ని లక్ష్యంగా చేసుకొని దాడికి దిగుతుంది. ప్రస్తుతం అమల్లోకి తెచ్చిన సీఏఏ ద్వారా మైనార్టీలను ను లక్ష్యంగా చేసుకున్నందుకు అడుగు వేశారని విమర్శించారు.సిఏఏ అనేది పౌరుల రాజ్యాంగ విలువలను లక్ష్యంగా చేసుకుంటుందని వారు ఆరోపించారు.ఈ చట్టం వచ్చినప్పుడు దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలు జరిగాయని ,అయినా త్వరలో లోక్సభ ఎన్నికలకు ముందు ఈ మైనార్టీ వ్యతిరేక చట్టాన్ని తీసుకొచ్చారని ,ఇది ప్రజల మధ్య విభజన తేవడానికి ప్రయత్నం అని వారు విమర్శించారు, ఈ చట్టం తమకు ఆమోదయోగ్యం కాదని సిపిఎం ఇప్పటికే స్పష్టం చేసింది కేరళ వంటి సిపిఎం పాలిత రాష్ట్రాలు సి ఏ ఏ ను అమలు చేయబోమని తమ వైఖరిని వెల్లడించారు.కాబట్టి సి ఏ ఏ అమలు జరుగుతే దేశ భవిష్యత్తుకు ముప్పు వాటిల్లుతుందని వారు అన్నారు. జరగబోయే సెమినార్కు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

## నంద్యాల సబ్ డివిజన్ పరిధిలో 30 పోలీస్ యాక్ట్

**- డిఎస్‌పి ఎన్. రవీంద్రనాథ్ రెడ్డి**



**ఆంధ్ర ప్రగతి/నంద్యాల(మార్చ్ 15):** నంద్యాల సబ్ డివిజన్ పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్ లు అనగా నంద్యాల టౌన్ లోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో మరియు మహనంది, బండిఆత్మకూరు, గోస్పాడు, పాణ్యం మరియు గడివేముల పోలీస్ స్టేషన్ ల పరిధిలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ఎవరైనా గానీ ఏవైనా సభలు, సమావేశాలు,ర్యాలీలు, ఉత్సవాలు , ధర్నాలు ,రాస్తారోకోలు నిర్వహించుకొదలచిన వారు తప్పనిసరిగా పోలీస్ వారి అనుమతి తీసుకోవలయును.అట్లు పోలీస్ వారి అనుమతి లేకుండా ఎవరైనా ఏవైనా సభలు, సమావేశాలు,ర్యాలీలు, ఊరేగింపులు మొదలగు కార్యక్రమాలు నిర్వహిస్తే వారిపై పోలీస్ వారు చట్టపరమైన చర్యలు తీసుకోబడును.

## ఖాన్ పెట్స్ షాప్‌ను ప్రారంభించిన ఎన్ఎండి ఫిరోజ్



**ఆంధ్ర ప్రగతి/నంద్యాల(మార్చి 15):** నంద్యాల పట్టణం బాలాజీ కాంప్లెక్స్ లో ఖాన్ పెట్స్ షాప్ ను ముఖ్య అతిథిగా నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్ ఎండి ఫిరోజ్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువకులు చెడు దారి పెట్టకుండా మంచి అలవాట్లతో ముందుకు వెళ్లాలని వారి కాళ్ళ మీద వారు నిలబడేటట్లు స్వయంకృషితో డబ్బులు సంపాదించుకోవాల న్నారు. ఈ షాపును ఓపెన్ చేయడం చాలా సంతోషంగా ఉం దని భవిష్యత్తులో యువకులు వారి స్వయంకృషితో మరికొన్ని షాప్స్ ఓపెన్ చేసుకొని ఒకరి మీద ఆధారపడకుండా వారే ఉపాధి అవకాశాలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు.

## రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా వ్యవసాయ అధికారి

**ఆంధ్ర ప్రగతి నంద్యాల(మార్చి 15):** నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి అధికారి, టి. మోహన్ రావు.పుసులురు గ్రామాన్ని సందర్శించి రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేసి రబీ పంటకు గాను పంట నమోదు చేసుకున్న రైతులకు పంట నమోదు రశీదులు పంచడం జరిగింది. అదేవిధంగా రైతు భరోసా మ్యాగజైన్‌లు పంచడం జరిగింది.ఇందులో భాగంగా జిల్లా వ్యవసాయ అధికారి,టి.మోహన్ రావు మాట్లాడుతూ జిల్లాలో రబీలో పంట నమోదు చేసుకున్న రైతు సొదరుల ందరూ మీ యొక్క గ్రామ రైతు భరోసా కేంద్రాల యందు పంట నమోదు రశీదులు తీసుకోవాల్సిందిగా కోరడమైనది. అదేవిధంగా ఇప్పటివరకు ప్రభుత్వ జొన్న పంట కొనుగోలు కేంద్రాలలో దాదాపు 22000 మెట్రిక్ టన్నుల జొన్న లు కొనుగోలు చేయడం జరిగింది. ఇంకా మార్క్ ఫెడ్ ద్వారా జొన్నలు పంట కొనుగోలు చేయడం జరుగుతుంది. కావున ఇంకా ఎవరైనా జొన్న వేసి అమ్ముకోని రైతులు మీ యొక్క రైతు భరోసా కేంద్రాల సిబ్బంది దగ్గర రిజిష్టర్ చేసుకొని ఈ సద వకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరడమైనది.




# ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చిన ఎమ్మెల్యే శిల్పా రవి





**ఆంధ్ర ప్రగతి/నంద్యాల(మార్చి 15):** పవిత్ర రంజాన్ మాసంను పురస్కరించుకొని పట్టణంలోని 15 మసీద్ లలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఎమ్మెల్యే శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి ఏర్పాటు చేశారు. నంద్యాల పట్టణం లోని మూలసాగరం ప్రాంతంలోని మహమ్మాదీయ మరియు కౌసర్ మసీద్ ల యందు శుక్రవారం ముస్లిం సోదరులతో, పెద్దలతో కలిసి ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అలాగే పట్టణం లోని యూసఫ్, ఇస్మాయిల్, రహ్మత్, మదీనా మసీద్, ఫతిమా, మక్కా మస్జిద్, మదీనా, అబు సౌద్, జులేఖ ఖాసీం వంటి 15 మస్జిద్ లలో పవిత్ర రంజాన్ మాసంను పురస్కరించుకొని ఎంఎల్ఏ శిల్పా రవి రెడ్డి ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. అల్లా అందరికి మంచి చేయాలని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం మసీద్ పెద్దలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పాల్గొన్నారు. అల్లా దయవల్ల నంద్యాల నియోజకవర్గంలో ఎన్నడు జరగని విధంగా అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలు నిర్వహించడం జరిగిందని, అదే విధంగా 2024 సంవత్సరంలో కూడా మరింత అభివృద్ధి చేపట్టడానికి ఆ అల్లా కృపచూపాలని ఎమ్మెల్యే కోరారు.

## కుమ్మరి శాలివాహనులకు టిడిపి అండగా ఉంటుంది

**- మాజీ మంత్రి నంద్యాల టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్**



**ఆంధ్ర ప్రగతి/నంద్యాల(మార్చి 15):** నంద్యాల జిల్లా కుమ్మరి శాలివాహన జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి ఆధ్వర్యంలో కుమ్మరి శాలివాహనులు పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీలో తెలుగుదేశం పార్టీ సీనియర్ లీడర్ ఫరూక్ మరియు టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆడ్వికేట్ తులసి రెడ్డి ఆధ్వర్యంలో చేరడమైనది తెలిపారు.ఈ సందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ శాలివాహనలకు కావలసిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని టిడిపి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత వారికి ప్రత్యేక రాయితీలు ఇప్పిస్తామన్నారు. ఈ సందర్భంగా కుమ్మరి శాలివాహన జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ మా శక్తి వంచన లేకుండా ఫరూక్ గెలుపు కొరకు కష్టపడి ఎన్ఎండి ఫరూక్ ని గెలిపించుకుంటామన్నారు . బీసీలకు న్యాయం జరగాలంటే ఒక్క తెలుగుదేశం పార్టీలోనే జరుగుతుందని నమ్మకంతో మా శాలివాహనులందరూ మూకుమ్మడిగా తెలుగుదేశం చేరడమైనదని తెలిపారు . ఈ కార్యక్రమంలో కుల పెద్దలు బండల రాముడు, వెంకటేశ్వర్లు గురునాథ్, నాగభూషణం , చింతకుంట నాగిశెట్టి, వెంకటసుబ్బన్న, పెద్ద కొట్టాల తేజ, పులిమద్ది నారాయణ, రంగస్వామి వారు పోన్నాపురం జగదీష్ , కాంట్రాక్టర్ చిన్న, శ్రీనివాసులు , పోన్నాపురం ప్రభాకరు, పోన్నాపురం చంద్ర .పుల్లయ్య నారాయణ,దస్తగిరి, రమణ రమేష్ , రాము, మాధవ, నాగన్న , సుబ్బయ్య మిగతా కుల పెద్దలు పెద్ద ఎత్తున చేరడం జరిగినది.



# శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం

**ఆంధ్ర ప్రగతి/నంద్యాల(మార్చి 15):** శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల నందు శుక్రవారం నాడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి. రామకృష్ణ రెడ్డి , కళాశాల డైరెక్టర్ జి. హేమంత్ రెడ్డి మరియు కళాశాల ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి. రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మార్చి 15న జరుపుకుంటారు. ఈ రోజు యు. ఎస్ కాంగ్రెస్‌లో ప్రసంగిస్తూ 15 మార్చి 1962న వినియోగదారుల హక్కులపై జాన్ కెన్నెడీ (మాజీ యూ.ఎస్ అధ్యక్షుడు) చేసిన ప్రసంగం నుండి ప్రేరణ పొందిందని కన్స్యూమర్స్ ఇంటర్నేషనల్ వర్కర్ అయిన అన్వర్ ఫజల్ తరువాత ఈ రోజును ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవంగా ప్రతిపాదించారు అని1983 సంవత్సరం మొదటి వినియోగదారుల హక్కుల దినోత్సవం జరిపారువినిమయం చేయబడే వస్తువుల లేదా సేవలను పొందే వ్యక్తి లేదా వ్యక్తులు, ఇలాంటి వ్యక్తుల హక్కుల పరిరక్షణ కోసం వినియోగదారుల రక్షణ చట్టం 1983న అమలులోకి వచ్చింది అని తెలిపారు.కళాశాల డైరెక్టర్ జి. హేమంత్ రెడ్డి గారు మాట్లాడుతూ ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం ముఖ్యమైనది ఎందుకంటే ఇది సాధారణ ప్రజల వినియోగదారుల హక్కులను గుర్తించి, వారిపై చర్య తీసుకునే రోజు. అంతేకాకుండా,



వినియోగదారుగా ప్రతి వ్యక్తి యొక్క ముఖ్యమైన వ్యక్తీకరణ ఇది, ఎందుకంటే వారు ప్రతి ఒక్కరినీ ప్రభావితం చేసే సానుకూల చర్యలు తీసుకుంటారు. అందుకోసం మార్చి 15 1983 నుంచి ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం కార్యక్రమాన్ని జరిపిస్తున్నారు అని తెలిపారు.కళాశాల ఉపాధ్యాయులు ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ వస్తువులు, సేవల నాణ్యత, సామర్థ్యం, స్వచ్ఛత, ధర, ప్రమాణం.. వీటికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకొనే హక్కును కలిగి ఉండటమే వినియోగదారుల యొక్క హక్కు అని అర్థం. 1962, మార్చి 15న అమెరికా దిగువ సభలో వినియోగదారు హక్కుల బిల్లును ప్రతిపాదించగా అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడి అమెరికా ప్రజలకు మొదటిసారిగా నాలుగు వినియోగదారుల హక్కులు ప్రకటించాడు అనిభారత దేశంలో 1986లో వినియోగ దారుల ప్రయోజనార్థం, వారి హక్కుల పరిరక్షణ కోసం వినియోగ దారుల హక్కుల పరిరక్షణ చట్టం రూపొందించారు అని తెలిపారు.కళాశాల ఉపాధ్యాయురాలు శ్రావణి మాట్లాడుతూ భారత ప్రభుత్వం 1989లో మార్చి 15వ తేదీని వినియోగ దారుల దినోత్సవంగా ప్రకటించింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం మనం ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని మార్చి 15 న జరుపుకుంటున్నాం అని,వాణిజ్య వ్యాపారాల్లో, ప్రభుత్వ యంత్రాంగంలో, సేవా సంస్థల్లో పనిచేసే వారు నిర్లక్ష్యంగా, మోస పూరితంగా వ్యవహరించి నప్పుడు కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రపంచం లోని చట్టాలన్నింటి కన్నా మెరుగ్గా భారత దేశంలో తొలిసారి 1986లో వినియోగ దారుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని రూపొందించారు అని తెలిపారు.కళాశాల ఉపాధ్యాయులు రత్న రెడ్డి మాట్లాడుతూ ప్రపంచం లోని చట్టాలన్నింటి కన్నా మెరుగ్గా భారత దేశంలో తొలిసారి 1986లో వినియోగ దారుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని రూపొందించారు. తక్కువ సమయంలో, అతి తక్కువ రుసుముతో, దళారుల ప్రమేయం లేకుండా జిల్లా, రాష్ట్ర, జాతీయ వినియోగదారుల ఫోరాల్ని, కమిషన్లను ఆశ్రయించి వ్యక్తిగతంగా సత్వర న్యాయం పొందే సౌలభ్యం దీని ద్వారా లభించింది. ఇప్పుడు సైబర్ నేరాల కారణంగా దాని స్థానంలో కొత్త చట్టాన్ని తెచ్చారు. ఈ నూతన చట్టాన్ని 2020 జూలై 20 నుంచి దేశవ్యాప్తంగా అమలు పరుస్తున్నారు అని తెలిపారు.చివరగా ఈ కార్యక్రమం జాతీయ గేయం ఆలాపనతో ముగిసింది.

# మహిళలకు ఇచ్చిన హామీని నెరవేర్చాం: ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి

**ఆంధ్ర ప్రగతి/నంద్యాల(మార్చి 15):** నంద్యాల పట్టణం ఓల్డ్ టౌన్ 9వ వార్డులో గతంలో స్థానిక మహిళలకు కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేస్తానని ఇచ్చిన మాటను నెరవేర్చామని ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం 8.5లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ ను ఏర్పాటు చేసి, మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, వైస్ చైర్మన్ పాంషావలి, వార్డు కౌన్సిలర్ దండే నాగమ్మ, కోఆప్షన్ సభ్యుడు పడకండ్ల సుబ్రమణ్యం ఆద్వర్యంలో ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఓల్డ్ టౌన్ అభివృద్ధిలో భాగంగా గతంలో 9వ వార్డుకు చెందిన మహిళలు కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని కోరడం జరిగిందన్నారు. నాడు వారికి ఇచ్చిన మాటను నెరవేరుస్తూ కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కమ్యూనిటీ హాల్ ద్వారా మహిళలు స్థానికంగా సమావేశాలు, పొదుపు సంఘం సమావేశాలు తదితర కార్యక్రమాలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వార్డులో పలు రోడ్లకు సంబంధించి ప్యాచ్ వర్క్స్ కొరకు 15లక్షల రూపాయల మేర



టెండర్లు పిలవడం జరిగిందని, త్వరలో పనులను ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే వార్డులో సీసీ రోడ్లు, కల్వర్టు, విద్యుత్ స్తంబాలు ఏర్పాటు చేశామన్నారు. మినరల్ వాటర్ ప్లాంట్, జెండామాను నుండి వెంకటేశ్వరస్వామి దేవాలయం వరకు సీసీ రోడ్డు పూర్తి చేసి ప్రజలకు మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దామన్నారు. శిల్పానగర్ నందు 51 కుటుంబాలకు వన్ టైం సెటిల్మెంట్ చేసి ఇళ్ల పట్టాలను అందజేయడం జరిగిందన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం



దశలవారిగా నెరవేరుస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జి దండే సుధాకర్,సలాముల్లా, వైఎస్సార్సీపీ కౌన్సిలర్ సాధిక్ బాష, వైసీపీ నాయకులు దేశం సుధాకర్రెడ్డి, ఆర్లవెంకటస్వామి, గన్నీ కరీం, దండె శ్రీనివాసులు,సుభయ్య, అమీర్, బాష, కుర్రు, స్థానిక మహిళలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## నంద్యాల పట్టణ సమగ్రాభివృద్ధి దిశగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం: ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి

**- 15వ వార్డు పరిదిలో 63లక్షలతో సీసీ రోడ్డు, డ్రైన్ల నిర్మాణం**







**ఆంధ్ర ప్రగతి/నంద్యాల(మార్చి 15):** నంద్యాల పట్టణ సమగ్రాభివృద్ధి దిశగా 15 వార్డులలో 63లక్షలతో సీసీ రోడ్డు, డ్రైన్ల నిర్మాణ అభివృద్ధి పనులను శుక్రవారం ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీ, మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి, స్థానిక వార్డు కౌన్సిలర్ సన్నాల అనూష, ఇంచార్జ్ సాయి రాంరెడ్డితో కలిసి ప్రారంభించారు. 15వ వార్డులో 63లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజ్, ప్యాచ్వర్క్, వేసవికాలంలో ప్రజల దాహార్తి తీర్చేందుకుగాను రెండు చలివేంద్రాలను ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...నంద్యాల పట్టణ సమగ్రాభివృద్ధికి అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. 15వ వార్డులో 3లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజ్, ప్యాచ్వర్క్ నిర్వహించడం జరిగిందన్నారు. ప్రధానంగా రెవెన్యూ క్వార్టర్స్ నందు భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని, వాటిలో కొందరు ఆకతాయిల చేష్టలతో స్థానికులకు ఇబ్బందులు కలుగజేస్తున్నారని సమస్యను తెలియజేస్తూ పరిష్కరించాలని కోరడం జరిగిందని తెలిపారు. ఈ శిథిల భవనాలను కూల్చివేయాలని కోరడం జరిగిందన్నారు. వార్డులో 63 లక్షల మేర అభివృద్ధి పనుల్లో భాగంగా నేడు సీసీ రోడ్లు, డ్రైన్లు, ప్యాచ్వర్క్ పూర్తి చేసి ప్రారంభించామని తెలిపారు. గతంలో ఈ వార్డులో విద్యుత్ స్తంబాలు, వీధిదీపాలు, విద్యుత్ తీగలను మార్చివేసి కొత్తవి ఏర్పాటు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించామన్నారు. నాడు నేడు క్రింద స్థానికంగా పాఠశాలల రూపురేఖలను మార్చడం జరిగిందని, అలాగే 3.75కోట్ల రూపాయల వ్యయంతో నూతన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నిర్మాణాన్ని చేపట్టామని పేర్కొన్నారు. భవిషత్తులో మరింత అభివృద్ధి సాధించేందుకు తనకు మరోసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సురేష్ పాల్, మోహన్, లింగప్రసాద్, శ్రీనివాసులు, గిరిధర్, సంపత్, లక్ష్మీదేవి, రామలక్ష్మి, ఉస్మాన్, సలీం, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవియన్స్ డే నిర్వహణ

**- సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత - నంద్యాల జిల్లా ఎస్పీ కె . రఘువీర్ రెడ్డి**

**ఆంధ్ర ప్రగతి/నంద్యాల(మార్చి 15):** పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కొరకు నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు గ్రీవియన్స్ డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లు ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది వారి మ్యూచువల్ ట్రాన్స్ఫర్, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీల గురించి జిల్లా ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. జిల్లా ఎస్పీ సిబ్బంది సమస్యలను విని, వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని సిబ్బందికి భరోసా కల్పించారు.పోలీస్ సిబ్బంది సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇస్తూ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి శుక్రవారం నిర్వహించే పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమంలో సిబ్బంది వారి సమస్యలను నిర్భయంగా తెలియజేసుకోవచ్చని జిల్లా ఎస్పీ గారు తెలిపారు. విధినిర్వహణలో సిబ్బంది సతమత పడకుండా వారి సమస్యల తొలగించి రాబోయే ఎన్నికలలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చెయ్యటమే లక్ష్యమని తెలియచేసినారు.సిబ్బంది యొక్క ఫిర్యాదుల సమస్యలను పరిష్కరించాలని సంబంధిత జిల్లా పోలీసు కార్యాలయ అధికారులను ఆదేశించారు.




## శ్రీ భీమలింగేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణ పనులకు భూమి పూజ




**ఆంధ్ర ప్రగతి/నంద్యాల(మార్చి 15):** నంద్యాల పట్టణంలో వెలిసిన శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానం( మూలమట్టం). నందుదేవస్థానం యొక్క పునర్ నిర్మాణ పనులకు గాను భూమి పూజ కార్యక్రమం చేయబడినది. దేవస్థానం నిర్మాణం కొరకుసిజిఎఫ్ నిరుదుల ద్వారా రూ. ఒక్క కోటి 25 లక్షల రూపాయలు ఎమ్మెల్యే రవిచంద్ర కిషోర్ రెడ్డి సహకారంతో కోటి 25 లక్షల రూపాయలు మంజూరు చేయించడం జరిగినది. ఈ భూమి పూజ కార్యక్రమం కు కౌన్సిలర్ భీముని పల్లి పురంధర్. దేవస్థానం ఎక్స్ చైర్మన్ సన్నాల వెంకటరెడ్డి ఎక్స్ ధర్మకర్తల మండలి సభ్యులు పల్లెపుగు సావిత్రి మిట్టమీది రవికుమార్ రెడ్డి. శ్రీ ఆంజనేయ కోదండరామ స్వామి దేవస్థానం చైర్మన్ చెన్నా వెంకటేశ్వర్లు. మరియు కాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి. యు లక్ష్మీనారాయణ గారుమరియు పట్టణ పుర ప్రముఖులు పాల్గొనడం జరిగిందని దేవస్థానం కార్యనిర్వాహణాధికారి టి రామాంజనేయ శర్మ తెలియజేశారు.

## బీసీలకు 50 సంవత్సరాలకే పింఛన్ అమలు చేస్తాం





**ఆంధ్ర ప్రగతి/నంద్యాల(మార్చి 15):** నంద్యాల నియోజకవర్గంలో క్లస్టర్ 7 ఇంచార్జ్ దుదేకుల దస్తగిరి ఆధ్వర్యంలో క్లస్టర్ 7 బీసీ డిక్లరేషన్ మీటింగ్ నంద్యాల టీడీపీ పార్టీ కార్యాలయం నందు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నంద్యాల జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ బీసీలకు అత్యున్నత స్థానం కల్పించిందని బీసీల పార్టీ ఏదైనా ఉందంటే అది తెలుగుదేశం పార్టీ అని తెలియజేశారు. అనంతరం టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీల కోసం ప్రత్యేక చట్టాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. బీసీలకు 50 సంవత్సరాలకే పింఛన్ అమలు చేస్తామన్నారు. పింఛన్ 4000 వరకు పెంచుతామన్నారు. బీసీలు అభివృద్ధి చెందడానికి ప్రత్యేక నిధులు కేటాయించి వారికి ప్రత్యేక రాయితీలు కూడా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇస్తుందన్నారు. అలాగే బీసీలకు అత్యున్నత స్థానం కల్పించిందని పార్టీ ఏదైనా ఉందంటే అది తెలుగుదేశం పార్టీ అని తెలియజేశారు. అలాగే బీసీలంతా ఏకమై ఈసారి తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ జైనబి , విజయ్ గౌరీ యాదవ్ , మంజుల సుబ్బరాయుడు , వడ్డె జనార్ధన్, రాము తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లైఫ్ పరివర్తన సెంటర్ బాలలకు సేవా కార్యక్రమం



**ఆంధ్ర ప్రగతి/నంద్యాల(మార్చి 15):** నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక లైఫ్ పరివర్తన సెంటర్లో ఉన్న హెచ్ఐవి పాజిటివ్ బాలలకు లయన్స్ క్లబ్ సభ్యుడు గుండా మనోజ్ సౌజన్యంతో నిత్యావసర కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు పి.వీ. సుధాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ హెచ్ఐవి పాజిటివ్ వచ్చిన వారిని సమాజం ఆదరించి అన్ని రకాలుగా సహకరించి వారు ఆరోగ్యవంతమైన జీవితం గడిపే లాగా తోడ్పడాల్సిన అవసరం ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు పివి సుధాకర్ రెడ్డి తో పాటు కార్యదర్శి సోమేశుల నాగరాజు,లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ చంద్రమోహన్, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ ఎం.పీ.వి. రమణయ్య,గుండా మనోజ్ తదితరులు పాల్గొన్నారు.